క్లుప్తంగా

వైభవంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహారావు శనివారం లక్ష 116 రూపాయిల విరాళం అందజేశారు. దాత దాతకు దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేసి స్వామి దర్శనం కల్పించారు.

ఆత్మకూరికి ఘన నివాళి



ఆత్మకూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 92వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయ్‌కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డీజీఎం బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. అత్యుత్తమ సేవలందించిన వారిని సత్కరించారు.

ఎన్నికలకు సిద్ధం కండి

సీతంపేట: దేశంలోతో పాటు రాష్ట్రంలో రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, తమ పార్టీని ప్రత్యామ్నాయంగా చూపాలన్నారు. భవిష్యత్ కార్యాచరణపై కార్యవర్గ సభ్యులతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ, జిల్లా ఇన్‌చార్జులు సిహెచ్.ప్రభాకర్, బొడ్డపాటి వెంకటరమణ, దివకాల గంగరాజు, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: డిసెంబర్‌లో నిర్వహించనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌కు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నగరంలోని ఓ ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ డిసెంబర్ 23, 24న ఈ కన్వెన్షన్ జరగనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా సమావేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉప్పలపాటి శుభ, ద్వారకానాథ్, రాంజీ, రఘు, మధుసూదన్ కృష్ణంరాజు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మహానేతా.. మనసాస్మరామి

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆత్మీయ అంజలి ఘటించారు. సేవా కార్యక్రమాలతో ఘన నివాళులర్పించారు.

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- సేవా కార్యక్రమాలతో ఘన నివాళి



పరవాడ సంతబయలులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు

పరవాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతిని పరవాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సంతబయలులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ , ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆరోగ్య శ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అమలు చేసి ప్రజల ఆశీస్సులు పొందారన్నారు. తండ్రి ఆలోచనలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ తండ్రిని మించిన తనయుడుగా నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క, రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, జేసీఎస్ కన్వీనర్



గౌతులచ్చన్న నగర్ వద్ద మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

వెన్నల సన్యాసిరావు, మండల వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, డైరెక్టర్ మడక సూరిబాబు పాల్గొన్నారు.

- గౌతులచ్చన్ననగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దేశపాత్రునిపాలెంలో వైఎస్ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సింహాచలం: ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచి ఉంటారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. మహానేత వైఎస్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం సుజాతనగర్‌లోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్‌తో కలి ముమ్మన దేముడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని 93వవార్డులో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకురాలు దాసరి అన్నపూర్ణ పేదలకు దుప్పట్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి సత్తిబాబు పాల్గొన్నారు.
- 94వవార్డు వేపగుంట కూడలిలోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 98వవార్డు అధ్యక్షుడు ఎర్ర వరహానరసింహం పాల్గొన్నారు.
- జీవీఎంసీ 98వవార్డు అడవివరం మార్కెట్ కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పీతల అప్పలరాజు, ఎన్. రామరాజు, లంక సత్తిబాబు, బోర కృష్ణారెడ్డి,దాసరి కనకరాజు, లండ రమణ పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్

సబ్బవరం: మండలంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం మూడు రోడ్లు కూడలిలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల పెన్నిధి వైఎస్సార్ అని కొనియాడారు. ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి ప్రాణదాతగా అందరి హృదయాల్లో కొలువయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,వనం అచ్చెంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు,పల్ల కృష్ణ, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, బంతికోళ్ల పద్మ, దెడ్డం పద్మావతి, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- ఆరిపాకలోని వైఎస్సార్ సేవా ట్రస్ట్ వద్ద ఉన్న దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ట్రస్టు అధ్యక్షుడు పెనుమత్స శ్రీనివాసరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఎం రాజు,అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మూడు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి



మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, మెంటి మహేష్



వేపగుంట కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అజయ్‌రాజ్



అడవివరంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈశ్వరరావు, వరహానరసింహం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాసరి అన్నపూర్ణ

' అక్రమ సర్క్యులర్ రద్దు చేయాలి'

పరవాడ: ఎన్టీపీసీ యాజమాన్యం అక్రమంగా విడుదల చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఫోన్లను ప్లాంటు లోపలికి అనుమతించబోమని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్లాంట్లో జరుగుతున్న ప్రమాదాలు, అన్యాయాలను గోప్యంగా ఉంచడం కోసమే యాజమాన్యం స్మార్ట్ ఫోన్లను అనుమతించడం లేదని గనిశెట్టి ఆరోపించారు. మరుగుదొడ్ల సమస్యను వెంటనే పరిష్కరించడానికి యాజమాన్యం చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

గ్రామ వలంటీర్ పోస్టు భర్తీకి ఆహ్వానం

సింహాచలం: పెందుర్తి మండలం ముదపాకలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పెందుర్తి ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఈ నెల 8న దరఖాస్తుల పరిశీలన, 11న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 12న సమాచారం, 13న నియామకం ఉంటుందన్నారు.

నూతన సీజీఎంకు హెచ్ఎంఎస్ అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ డివిజన్ సీజీఎం ఎన్.వి. స్వామిని స్టీల్ హెచ్ఎంఎస్ నాయకులు అభినందించారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు శాలువా కప్పి, బొకే అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.గణపతిరెడ్డి, డి.అప్పారావు, జి.అప్పలరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారం 17వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సడలని ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: దేశంలోని ఏ పరిశ్రమ కోసం కూడా ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న విశాఖ ఉక్కు దీక్షకే ఈ ఘనత దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 933వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో శనివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశ వ్యాప్తంగా కార్మికవర్గం ఐక్యంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కన్నాజీ సేవలు ప్రశంసనీయం

డాబాగార్డెన్స్ : ప్రముఖ వాద్య కారుడు, దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలిచ్చి వేలాది మంది అభిమానుల్ని సంపాదించుకున్న కన్నాజీ సంగీత రంగంలో అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన కన్నాజీ సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని కన్నాజీకి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంగీత రంగంలో కన్నాజీ నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారన్నారు. నీ స్నేహం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులు, కళాకారుల్ని అలరించింది. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు యుగంధర్, మహ్మద్‌ఖాన్, కారెం వినయ్‌ప్రకాష్, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, యాద్‌కుమార్, మమతతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏఏటీ బృందం పర్యటన

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (ఎస్ఎస్ఏఏటీ) బృందం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని బీఎల్ఓతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేసింది. శనివారం సచివాలయం పరిధి బీఎల్‌వో బండారు శ్రీనివాసరావు బృందాన్ని గ్రామంలో ఓటర్ల జనాభా ఆధారంగా ఓటర్ సీరియల్ నంబర్ల ప్రకారం సరిహద్దును చూపారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు మాట్లాడుతూ 2024లో జరగనున్న సాధారణ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల సర్వే వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఓటర్ల పరిజ్ఞానం, ఓటర్ల వైఖరి వంటి అంశాలను సేకరించనున్నట్లు తెలిపారు. సేకరించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల అధికారికి పొందుపర్చనున్నట్లు తెలిపారు. గాజువాక పరిధిలో పలు బృందాలు ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మోనటరింగ్ అధికారి వై.ఎర్రన్న, స్టేట్ రీసోర్స్ పర్సన్లు ఎం.తిరుపతిరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్.ఎస్.సాయన్న, రాయన్న, జిల్లా రీసోర్స్ పర్సన్లు బి.కృష్ణ, పి.సత్యనారాయణ, ఎస్.మనోజ్ పాల్గొన్నారు.



68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో బీఎల్‌వోతో కలిసి సరిహద్దును పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏఏటీ బృందం

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని నగర డీసీపీ నాగన్న అన్నారు. శనివారం బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ హార్మోనీ హౌజ్ హాలులో ప్రచార యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యాంటీడ్రగ్స్, యాంటీ ఆల్కహాల్ ప్రచారకులు సురేష్ బేత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ నాగన్న మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో యువతనే కాక అన్ని వయసుల వారిని విముక్తి చేయాలన్నారు. ఈ శుభ సంకల్పంతో ప్రచారయాత్ర ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఆర్ఐవో ఆర్. సత్యనారాయణ, గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈరోజు నుంచి రాష్ట్రంలోని నగర, పట్టణ, గ్రామాల్లో ఈ ప్రచారం ఉధృతం చేయనున్నట్లు బ్రాహ్మకుమారీస్ శిశలీల తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసే 200 మంది సభ్యులకు సాయంత్రం 6 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

జోరుగా బ్రిడ్జి విస్తరణ పనులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం నుంచి చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం మీదుగా బీఆర్‌టీఎస్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. సూర్యతేజానగర్, పార్వతీనగర్‌ల మధ్యలో ఉన్న ఈ బ్రిడ్జిని జీవీఎంసీ వెడల్పు చేస్తోంది. ప్రస్తుతం ఈ పనులు జరుగుతుండటంతో పార్వతీనగర్ మీదుగా చినగదిలి వెళ్లే రహదారికి కొద్ది రోజులు బ్రేక్ పడింది. చినగదిలి సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ వరకు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులతో డబుల్ రోడ్డు నిర్మించిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి శ్రీకాంత్‌నగర్, పార్వతీనగర్ వెళ్లడానికి ఇరుకు బ్రిడ్జిని ప్రస్తుతం విస్తరిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా బ్రిడ్జికి ఇరుపక్కలా తవ్వేశారు. బ్రిడ్జి ముందు రోడ్డును తవ్వి గెడ్డ నుంచి వచ్చిన మురుగు నీటిని పక్క నుంచి పోవడానికి తాత్కాలిక మార్గం చూపారు. దీంతో ఈ రహదారి పూర్తిగా మూతపడింది. ఈ పనులు పూర్తయ్యేంత వరకు ఈ మార్గం మూసి ఉంటుందని, అటుగా ప్రయాణించే వాహన చోదకులు బాలాజీనగర్, తోటగరువు మీదుగా బీఆర్‌టీఎస్‌కు వెళ్లాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సూచిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొమ్మాది చెరువు ఆధునికీకరణ పనుల పరిశీలన

కొమ్మాది: చెరువుల ఆధునికీకరణ త్వరితగతిన చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కొమ్మాది చెరువును పరిశీలించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నగరంలో చెరువులను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. కొమ్మాది చెరువు చుట్టూ ప్రహరీ, పటిష్టమైన గట్టు, పచ్చదనం, లైటింగ్ ఏర్పాటు చేయాలని, కాలువల్లో పూడికలు, అడ్డంకులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రహదారివైపు ఉన్న ఫుట్‌పాత్, ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి, ప్రజలు సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మ్యాపింగ్ చేసి పార్కులా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఇంజినీర్లు రవి, శ్యాంసన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఇతర అధికారులు

ప్రపంచ స్థాయికి తెలుగు సినిమా

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'తెలుగు సినిమా పోకడలు' అనే అంశంపై సీనియర్ సినిమాటోగ్రాఫర్, కళ్లు సినిమా డైరెక్టర్ ఎం.వి.రఘుతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లు సినిమా విశాఖలోనే నిర్మించామని, 30 ఏళ్లు గడిచినా ఆ చిత్రం గురించి ఇంకా మాట్లాడుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి ఎదిగిన తీరును వివరిస్తూ ప్రతి 20 ఏళ్లకు సినిమా ప్రేక్షకుల అభిరుచులు, వేష భాషలు మారుతుంటాయన్నారు. వాటిని పసిగట్టి తీసిన సినిమాలే బాక్సాఫీస్‌లో నిలబడుతున్నాయని చెప్పారు. ఇటీవల యువత ముందుకొచ్చి సినిమాలు తీయడం , అవి ప్రేక్షకుల ఆదరణ పొందడం శుభపరిణామమన్నారు. ఇటీవల అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు, ఆర్ఆర్ఆర్ పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. విశాఖ జిల్లా సినిమా అభివృద్ధికి అనువైనదని, ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఎం.వి.రఘు సుమారు 70 సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసి కళ్లు సినిమాతో ప్రాచుర్యం పొందారన్నారు. అనంతరం రఘును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, హస్సన్, ఛాట్ల బాబూరావు, బి.చిన్నారావు, ఉషారాణి పాల్గొన్నారు.



సినిమాటోగ్రాఫర్ రఘును సత్కరిస్తున్న నరవ ప్రకాశరావు

శ్రావ్యంగా గీతాశ్లోక పఠనం



గీతాశ్లోక పఠనంలో చిన్నారులు

ఆనందపురం : మండలంలోని గంభీరం వద్ద గల హరేకృష్ణ వైకుంఠం నిర్మాణ ప్రదేశంలో శనివారం సాంస్కృతిక కార్నివాల్‌లో భాగంగా నిర్వహించిన గీతాశ్లోక పఠనం శ్రావ్యంగా సాగింది. 5 నుంచి ఏడు తరగతుల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన కార్యక్రమంలో 8 పాఠశాలల నుంచి 59 మంది పాల్గొన్నారు. పిన్నం రత్నాజీరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నవోదయ విద్యాలయంలో వసతుల పరిశీలన

కొమ్మాది: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాన్ని, వసతులను పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. బాలలు క్రమశిక్షణతో ఉండాలని, అనుమతి లేకుండా ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో విద్యాలయంలోకి రానివ్వద్దని ప్రిన్సిపల్ కె.సంజయ్‌కు సూచించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరపాలని, విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సంగీతం, పాటలు మొదలైన వాటిలో వారు ఆసక్తి చూపేవిధంగా, వివిధ రంగాల్లో రాణించేలా తర్ఫీదునివ్వాలన్నారు. నవోదయ విద్యాలయాల్లో చదువుకున్న అనేక మంది కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారులుగా ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు బొండు సీతారాములు, జిల్లా బాల సంరక్షణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నవోదయ విద్యాలయంలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న అప్పారావు

నూకాలమ్మ ఆలయ ఈవోగా మురళీమోహన్

భీమునిపట్నం: భీమిలిలోని నూకాలమ్మ గ్రూప్ దేవాలయాల కొత్త కార్యనిర్వాహక అధికారి (ఈవో)గా బొంగరాల మురళీ మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడి గ్రామదేవత నూకాలమ్మ ఆలయంతోపాటు, లక్ష్మీ నర్సింహస్వామి, మెయిన్‌రోడ్డులోని శివాలయంతోపాటు ఆ ప్రాంగణంలోని ఆలయాలు, తాటితూరు గ్రామంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఈవోగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.